క్లుప్తంగా

గమనించండి..
బ్యాంకు ఖాతాకే పింఛను
ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి

రేపల్లె రూరల్: ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జూన్ నెలకు అందించే సామాజిక పింఛన్ నగదు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో జమ చేయడం జరుగుతుందని ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫోన్ నంబరుతో అనుసంధానమైన ఆధార్ కార్డు కలిగిన బ్యాంక్ ఖాతా లబ్ధిదారులకు నేరుగా బ్యాంకు ఖాతాలో పింఛను నగదు జమ అవుతుందని చెప్పారు. అనుసంధానం కాని లబ్ధిదారులతో పాటు నడవలేని, ఆరోగ్యం సరిగాలేని వారికి సచివాలయ సిబ్బంది ఇంటింటికి వచ్చి పింఛను నగదు అందజేస్తారని చెప్పారు. రేపల్లె మండలంలో 10,036 మంది పింఛనుదారులు ఉండగా 7,422 మంది లబ్ధిదారులకు డీబీటీ విధానం ద్వారా నేరుగా వారి బ్యాంకు ఖాతాకు నగదు జమ చేయడం జరుగుతుందన్నారు.

బ్యాంకు ఖాతాలకు పింఛను నగదు జమ

వేమూరు: సామాజిక పింఛన్ల నగదు నేడు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతుందని ఎంపీడీవో చంద్ర శేకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 14 గ్రామ సచివాలయాల పరిధిలోని జూన్ నెల పింఛన్లు పంపిణీ చేయాల్సిన లబ్ధిదారులు 7,388 మంది ఉన్నారు. ఇందులో 5,146 మందికి ఆధార్ నంబరు లింకు అయిన బ్యాంకు ఖాతాల్లో పింఛను నగదు జమ అవుతుందన్నారు. బ్యాంక్‌లో టెక్నికల్ సమస్య ఉన్న, మంచానికి పరిమితమైన, నడవలేని వారు 2,242 మందికి.. ఆయా గ్రామ సచివాలయ సిబ్బంది ఇంటికి వెళ్లి పింఛను నగదు పంపిణీ చేస్తారని తెలిపారు. బ్యాంక్‌లో జమ కాని లబ్ధిదారులు, ఇంటింటికి వెళ్లి ఇవ్వాల్సిన పేర్లు సాయంత్రం లోపు ఫోన్ ద్వారా వివరాలు అందజేయాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఇన్‌చార్జి ఏఈ పి.ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భట్టిప్రోలు, అద్దేపల్లిలలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

ఆ జీవోలు రద్దు చేయాలి

భట్టిప్రోలు: జీవో నెంబర్లు 26, 27, 28 రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.బాలాజి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి 12న ఈ జీవోలను తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇప్పటి వరకు గ్రూప్ 2, 3, 4కు టైప్ రైటింగ్ అర్హతను తొలగించి, సీపీటీ కోర్సు ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన విధించినట్లు చెప్పారు. ఇప్పటికే టైప్ రైటింగ్ ఉత్తీర్ణులైన నిరుద్యోగులు మరలా మరో పరీక్షకు వెళ్లమంటే శ్రమతో పాటు అధిక మొత్తం ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు బి. శ్రీనివాసరావు, వి. శ్రీనివాసరావు, వి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ప్రపంచ పొగాకు వ్యతిరేకదినం సందర్భంగా విద్యార్థులకు శుక్రవారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎన్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు డ్రాయింగ్, పేపర్ ఆర్ట్, కథలు, కథానికలు నేర్చుకుని సృజనాత్మక నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవాలని సూచించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఫిరంగిపురం: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఉపవిద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో వివిధ పాఠశాలల్లో పని చేసే ఎండీఎం ఏజెన్సీ నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. త్వరలో పాఠశాలలు పునఃప్రారంభం అవుతుండటంతో వంటగది శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. నాణ్యత విషయంలో ఎటువంటి రాజీపడవద్దని చెప్పారు. శిక్షకురాలు ప్రవీణ పాఠశాలలో భోజన పథకాన్ని ఏవిధంగా నిర్వహించాలో, రుచికరమైన పదార్థాలు ఏవిధంగా తయారు చేయాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ మహబూబ్ సుభానీ పాల్గొన్నారు.

గాయత్రీ సత్యదేవ మందిర వార్షిక బ్రహ్మోత్సవాలు



నగరంపాలెం: స్థానిక ఏటీ అగ్రహారంలోని శ్రీ కంచి కామకోటి పీఠ శంకర గాయత్రీ సత్యదేవ మందిరంలో శుక్రవారం వార్షిక బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా ప్రారంభించారు. పదిహేను మంది రుత్వికులతో, వేద పండితుల వేద స్వస్తితో వైభవంగా మొదలయ్యాయి. ఈ బ్రహ్మోత్సవాలను ఆలయ కమిటీ అధ్యక్షులు రాళ్లబండి వేంకట సత్యరామాంజనేయశర్మ పర్యవేక్షించారు.

మీ సేవలు హర్షణీయం

- సీఐ, ముగ్గురు ఎస్ఐల పదవీవిరమణ
- సన్మానించిన ఎస్పీ వకుల్ జిందాల్



పదవీ విరమణ చేసిన పోలీసు అధికారులను సన్మానించిన ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్లటౌన్: పోలీస్ శాఖలో 41 సంవత్సరాలుగా సుదీర్ఘ సేవలు అందించడం హర్షణీయమని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ విభాగంలో పనిచేస్తూ పదవీవిరమణ పొందిన నలుగురు పోలీసు అధికారులను శుక్రవారం ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం చాలా ఒత్తిడితో కూడుకున్నదన్నారు. ప్రజలకు నేరుగా సేవలు అందించడం పోలీసు ఉద్యోగంలోనే జరుగుతుందని పేర్కొన్నారు. అలాంటి ఉద్యోగంలో చేరడం చాలా గొప్ప అదృష్టంగా భావించాలన్నారు. పోలీస్ శాఖకు సుదీర్ఘ కాలంపాటు విశేష సేవలు అందించడం ఎంతో గొప్ప విషయమని అభినందించారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆహ్లాదకరంగా గడపాలని, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆకాంక్షించారు. విశ్రాంత ఉద్యోగుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఎటువంటి సమస్య వచ్చినా నేరుగా తమను కలవవచ్చునని, సాయం చేసేందుకు సిద్ధంగా ఉంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులు, పోలీస్ అధికారుల సమక్షంలో పదవీ విరమణ పొందిన సీఐ కేసీహెచ్ సాంబయ్య, ఎస్ఐ ఐ.శ్రీనివాసరావు, ఏఆర్ ఎస్ఐ పి.కాంతారావు, ఏఎస్ఐ సీహెచ్. సాంబయ్యను పూలమాలలు, దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్ఐ డి.శ్రీనివాస్‌రెడ్డి, అడ్మిన్ ఆర్.ఐ షేక్. మౌలుద్దీన్ పాల్గొన్నారు.

18 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల గుర్తింపు



సర్వేను పరిశీలిస్తున్న ఎంఈవో లాజర్

చెరుకుపల్లి: ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను మండలంలో 18 మందిని గుర్తించామని ఎంఈవోలు లాజర్, నవీన్ కుమార్ తెలిపారు. వీరికి భవిత కేంద్రం ద్వారా విద్యాబుద్ధులను అందించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు సీఆర్పీలు కేసనశెట్టి సురేష్, రత్న శ్రీధర్ పేర్కొన్నారు. మండలంలో నిర్వహిస్తున్న 18 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల గుర్తింపు సర్వేను శుక్రవారం వారు పరిశీలించారు. మానసిక వైకల్యం కలిగిన చిన్నారులకు భవిత స్కూలులో ఆటపాటలతో కూడిన విద్యను అందించి వీరిని సాధారణ విద్యార్థులుగా తీర్చిదిద్దటం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులు ఎటువంటి వైకల్యానికి గురైనా భవిత కేంద్రంలో గాని, సర్వేకు వచ్చిన భవిత సిబ్బందికి గాని వివరాలు తెలియజేసి సహకరించాలని కోరారు. ఈ చిన్నారులను తల్లిదండ్రులు కనీసం తమ సమీపంలోని పాఠశాలలకైనా పంపాలని విజ్ఞప్తి చేశారు. సర్వే జూన్ 9 వరకు కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీలు రవీంద్ర, టవీ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ధూమపాన రహిత సమాజం కోసం కృషి



నిజాంపట్నం: ధూమపాన రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కూచినపూడి పీహెచ్‌సీ వైద్యుడు నాగార్జున పేర్కొన్నారు. ధూమపాన వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వైద్యశాల ఆవరణంలో శుక్రవారం నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ధూమ పానానికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని కోరారు. వదిలిన పొగను పీల్చిన అనారోగ్యం పాలవ్వక తప్పదన్నారు. దీంతో కాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె జబ్బులకు దారితీస్తుందని చెప్పారు. అలాగే ఖైనీ, గుట్కా, విమల్ వంటి పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని కోరారు. అనంతరం నినాదాలు చేస్తూ గ్రామంలో పర్యటించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం కేసులో భార్యాభర్తల అరెస్టు

420 సీసాల గోవా మద్యం స్వాధీనం



సమావేశంలో మాట్లాడుతున్న సెబ్ సీఐ వి.వెంకటేశ్వర్లు

బాపట్లటౌన్: అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని సెబ్ సీఐ వి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. సెబ్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మండలంలోని స్టువార్టుపురం గ్రామానికి చెందిన ఉయ్యాల ఆనంద్, అతని భార్య అరుణ గోవా నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ బాపట్లకు తరలిస్తున్నారనే సమాచారంతో శుక్రవారం ఉదయం దాడులు నిర్వహించామని తెలిపారు. ఈ దాడుల్లో వారి నుంచి 420 సీసాల గోవా మద్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వీటితోపాటు సెల్ ఫోన్‌ను కూడా సీజ్ చేశామన్నారు. గతంలో కూడా వీరిపై ఇదే తరహా కేసు నమోదయ్యిందని వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీరిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచామన్నారు. విలేకరుల సమావేశంలో సెబ్ ఎస్ఐ పి.గీతిక, కానిస్టేబుల్ ఆర్ శిరీష పాల్గొన్నారు.

దుక్కి దేవమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



పొన్నూరు: మండలంలోని వెల్లలూరు గ్రామంలో వేంచేసియున్న దుక్కి దేవమ్మ తల్లి తిరునాళ్ల పురస్కరించుకొని శుక్రవారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ పాల్గొని, అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇక్కుర్తి మల్లికార్జునరావు, బండి బాబు, నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు- క్రేన్ ఢీకొని ఇద్దరికి గాయాలు



ధ్వంసమైన బస్సు, క్రేన్ ముందు భాగం

తెనాలిరూరల్: ఆర్టీసీ బస్సు, క్రేన్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయాలపాలవగా రెండు వాహనాలూ ధ్వంసమయ్యాయి. స్థానిక యడ్ల లింగయ్య పెట్రోలు బంకు రోడ్డులోని ఆషా థియేటర్ వద్ద పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు- క్రేన్ ఢీకొన్న ఘటన శుక్రవారం ఉదయం జరిగింది. గుంటూరు నుండి వస్తున్న ఆర్టీసీ బస్సు ప్రయాణీకులని దించి బస్ స్టేషన్ వైపుకు వెళుతుండగా ప్రియ డీలక్స్ వైపు నుంచి క్రేన్ రోడ్డు పైకి రావడంతో అదే సమయంలో అతివేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు క్రేన్‌ని ఢీ కొట్టింది. క్రేన్ ముందు భాగం, టైర్ పగిలి పోయింది. ఇదే సమయంలో క్రేన్ పక్కగా స్కూటీపై వెళుతున్న షేక్ అఫీబా, రాజశేఖర్ లకు గాయాలయ్యాయి. గాయాలైన వారిని స్థానికులు 108 ద్వారా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు మరొక ఆర్టీసీ బస్సును ఒవర్‌టేక్ చేసి అతివేగంగా రావటం వల్లే ఈ ప్రమాదం జరిగిందని క్రేన్ యజమాని ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఈ ప్రమాదంలో క్రేన్ సహా ఆర్టీసీ బస్సు ఎడమ భాగం పాక్షికంగా ధ్వంసమైంది. అంత పెద్ద ప్రమాదం జరిగినా ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

అజెండా ఏకగ్రీవంగా ఆమోదం



చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



కొళాయి పన్నుపై పరస్పరం విమర్శించుకుంటున్న సభ్యులు

తెనాలిరూరల్: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎజెండాలో ప్రతిపాదించిన అంశాలపై కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. కుళాయిలపై వేస్తున్న పన్ను విషయమై కౌన్సిల్ సభ్యుల మధ్య వాదనలు జరిగాయి. టీడీపీ కౌన్సిలర్ అన్నం పిన్నారావ్ మాట్లాడుతూ తన వార్డులో వేసిన కుళాయిల్లో నీటి సరఫరా లేదని, అయినా కుళాయిలకు పన్ను వేయడం సమంజసం కాదంటూనే పురపాలక సంఘం దోపిడీ చేస్తుందన్నారు. దీనికి వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య మాట్లాడుతూ నీటి సరఫరాలేని కుళాయిలకు పన్ను వేయడం టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిందని, దోపిడీ అనేది మీ టైం లోనే జరిగిందని విమర్శిస్తూ కౌంటర్ వేశారు. ఇంతలో చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కలుగజేసుకొని దోపిడీ అనడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. మరో టీడీపీ కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి కలగజేసుకుని పన్ను వసూలు చేయడం తప్పు కదా అని అనటంతో సభ్యుల మధ్య వాదనలు జరిగాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న మాట్లాడుతూ గతంలోనూ ఇదే సమస్యపై చర్చ జరిగిందని, ఇందుకు సంబంధించి కమిటీ వేశానని, ఈ లోగా ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయిందని చెప్పారు. ఆరో తేదీ తర్వాత దీనిపై సమగ్రమైనటువంటి నివేదిక ఇస్తానని కమిషనర్ చెప్పడంతో సమావేశం ప్రశాంతంగా ముగిసింది. ఈ సమావేశంలో మున్సిపల్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జెముడుపాడు లో కార్డన్ సెర్చ్

జెముడుపాడు(కొల్లిపర): సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. శుక్రవారం మండలంలోని జెముడుపాడు , పాలెం లో తెనాలి డీఎస్పీ రమేష్ ఆదేశాలతో తెనాలి లోకల్ 3టౌన్ సీఐలు, గ్రామీణ సీఐలు, కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐ ఆర్.రవీంద్రరెడ్డి ఉన్నత అధికారులతో కలసి సుమారు 50 మంది పోలీస్‌సిబ్బంది తో అనుమానితుల ఇళ్లు, పాతనేరస్తుల ఇళ్లలో తనిఖీచేసి సరైన ఆధారాలు చూపని 18 ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. రానున్న ఎన్నికల కౌటింగ్ సమయంలో గ్రామంలో అల్లర్లకు పాల్పడినా , అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తెనాలి, కొల్లిపర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా ఆంజనేయస్వామి ఉత్సవాలు



రేపల్లె రైలుపేటలో వీరాంజనేయస్వామి



నిమ్మకాయల మాలధారణ



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

బాపట్లటౌన్: పట్టణంలోని చీలురోడ్డు పాండు రంగస్వామి దేవాలయంలో వేంచేసియున్న వీరాంజనేయస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారికి ఉదయం పంచామృతస్నపన, తిరుప్పావడ సేవ, సాయంత్రం ఉచిత సామూహిక సిందూరార్చన కార్యక్రమాలు కనుల పండువగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలు శ్రీ లలితా త్రిపురసుందరీ పీఠం నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు పర్యవేక్షణలో జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు మేడూరి వెంకట అప్పలాచార్యులు, రొంపిచర్ల కేశవా చార్యులు, కమిటీ సభ్యులు పంగులూరి కొండిన్య, గూడూరు సాయి వెంకట్, యల్లాప్రగడ రమణ, ఆదూరి హరినారాయణ, నీరజాదేవి పాల్గొన్నారు.

ఐలవరం(భట్టిప్రోలు): మండలంలోని ఐలవరం గ్రామంలో కొలువైన శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో వేంచేసిన శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాలు పురస్కరించుకుని శుక్రవారం ఉదయం నుంచి ఏకాహం ప్రారంభమైంది. శనివారం హనుమజ్జయంతి పర్వదినం ఉదయం వరకు 24 గంటల పాటు భజన సంకీర్తన కొనసాగనుంది. దేవాలయ అర్చకులు దీవి రఘునాథ చక్రవర్తి ప్రత్యేక పూజలు నిర్వహించి, అఖండ దీపారాధన చేశారు. కొతరపు శివశంకరరావు సిద్ధాంతి ఆధ్వర్యంలో దీపాల సత్యన్నారాయణ బృందం హనుమాన్ చాలీసా సంకీర్తన కార్యక్రమం ఘనంగా జరిగింది. సమరసతా సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ, నిర్వాహకులు పాల్గొన్నారు.

నేడు హనుమజ్జయంతి వేడుకలు

భట్టిప్రోలు: స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో కొలువైన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, పెదపులివర్రు పంచాయతీ గాజుల పేటలోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరుగనున్నాయి. ఆకు పూజ, భజన కార్యక్రమం, ఊరేగింపు, అన్న సంతర్పణ ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

హనుమజ్జయంతి వేడుకలు

రేపల్లె రూరల్: పట్టణంలోని వివిధ ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. రైలుపేటలోని వీరాంజనేయస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. 1న హనుమత్ వ్రతం, 2న స్వామివారి కల్యాణం, 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం, 3న హనుమత్ హోమ పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉప్పూడి రోడ్డులోని శ్రీలక్ష్మీ గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో, ఓల్డ్ టౌన్‌లోని శ్రీవేణుగోపాలస్వామి, రైలు పేటలోని పట్టాభి రామస్వామి, పేటేరు రోడ్డులోని ఆంజనేయస్వామి, పెద అరవపల్లి, సింగుపాలెం, నల్లూరుపాలెం, బొందలగరువు తదితర గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆయా ఆలయాల నిర్వాహకులు తెలిపారు.

వీరాంజనేయ స్వామికి ప్రత్యేక అలంకరణ

జంపని(వేమూరు): మండలంలోని జంపని గ్రామంలో ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం స్వామి వారికి నిమ్మకాయలతో ప్రత్యేక అలంకరణ గావించారు. మువ్వ మల్లికార్జున దంపతులు ఉదయం సుప్రభాత సేవ అనంతరం స్వామి వారికి పంచామృత అభిషేకం జరిపారు. సాయంత్రం పల్లకీ ఉత్సవం అష్టోత్తర సహస్ర నామ పూజ జరిపించి, ప్రసాదం పంపిణీ చేశారు. కుచ్చెళ్లపాడు భజన సంఘం భజన కీర్తనలు ఆలపించారు. హనుమాన్ చాలీసా పారాయణ జరిపారు. నేడు హనుమజ్జయంతి సర్వదినం సందర్భంగా స్వామివారికి అభిషేకం, స్వర్ణ కమలాలతో అష్టోత్తర శతనామ పూజ జరిపించి, శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు.

సూర్య ప్రతాపం.. అంతా నిర్మానుష్యం



కూరగాయల మార్కెట్ సెంటర్



అంబేడ్కర్ సెంటర్

పొన్నూరు: భానుడి భగభగలకు జనం విలవిల్లాడుతున్నారు. రోహిణి కార్తె ప్రవేశించడంతో గతంలో కంటే ఎక్కువగా సూర్యుడు మండిపడుతున్నాడు. ఉదయం 10గంటలు దాటిందంటే బయటకు వెళ్లేందుకు జనం జంకుతున్నారు. విపరీతమైన ఎండల దృష్ట్యా ఉపాధి కూలీలు, ఇతర కూలి పనులు చేసుకునేవారు 11 గంటలలోపే ఇంటిబాట పడుతున్నారు. ఉక్కపోత, వడగాడ్పులకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మధ్యాహ్న సమయంలో పట్టణంలోని ప్రధాన కూడళ్లు బోసిపోతున్నాయి. నిత్యం జనంతో కిటకిటలాడే అంబేడ్కర్ సెంటర్, బాపట్ల రోడ్డు, రేపల్లె బస్ స్టాప్, కసుకర్రు రోడ్డు, తహసీల్దారు కార్యాలయం రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ వెలవెలబోతున్నాయి. ఎండలో పనులకు వెళ్లేవారు శీతల పానియాలు, కొబ్బరికోండాలు తాగుతూ ఉపశమనం పొందుతున్నారు. అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో బయటకు వెళ్లేవారు కనీస జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వడదెబ్బకు గురైతే ప్రథమ చికిత్స తీసుకొని సమీపంలోని ఆసుపత్రులను సంప్రదించాలని వైద్యులు సూచిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు, గర్భిణుల విషయంలో కుటుంబ సభ్యులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు. వేసవిలో చలి వేంద్రాలు ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుండి పట్టణానికి వచ్చే ప్రజలు దాహార్తితో అల్లాడుతున్నారు.

తెనాలి ఠాణాలో ప్రైవేటు చోదకుల హవా

- లైసెన్సు ఉన్న హోంగార్డులు, కానిస్టేబుళ్లను వద్దంటున్న పోలీస్ బాస్‌లు
- ప్రైవేటు డ్రైవర్లతో దందాలు?



తెనాలిరూరల్: తెనాలి పోలీసు శాఖలో ప్రైవేటు డ్రైవర్లదే హవా నడుస్తోంది. అధికారుల సొంత పనులతో పాటు వారికి సంబంధించిన దందాలు వీరి చేతుల మీదుగానే జరుగుతున్నాయన్నది బహిరంగ రహస్యం. డ్రైవింగ్ లైసెన్సు కలిగిన హోంగార్డులు, కానిస్టేబుళ్లు ఉన్నా వారిని కాదని మరీ ప్రైవేటు వ్యక్తులను డ్రైవర్లుగా అధికారులు పెట్టుకుంటున్నారు. తెనాలి పట్టణం, మండలంకు సంబంధించి నాలుగు పోలీస్‌స్టేషన్లు ఉండగా నలుగురు ప్రైవేటు వ్యక్తులు డ్రైవర్లుగా పని చేస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్సు ఉన్న ఇద్దరు హోంగార్డులు, సుమారు 10 మందికిపైగా కానిస్టేబుళ్లు ఉన్నారు. అయినా వీరెవరినీ డ్రైవర్లుగా వినియోగించుకునేందుకు అటు ఎస్ఐలు, ఇటు సీఐలు ఆసక్తి చూపడంలేదు. తమకు కావల్సిన బయటి వ్యక్తులనే డ్రైవర్లుగా పెట్టుకుని అసలు సిబ్బందిని నిర్లక్ష్యం చేస్తున్నారు.

దందాల కోసమే ప్రైవేటు వ్యక్తులా.?

పోలీసు అధికారులు చేసే అక్రమాలు, దందాల కోసమే ప్రైవేటు వ్యక్తులను సొంత డ్రైవర్ల కింది పెట్టుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఎన్నికల బదిలీల్లో వచ్చిన అధికారులు సైతం ప్రైవేటు వ్యక్తులనే డ్రైవర్లుగా పెట్టుకున్నారు. తెనాలిలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో డ్రైవరుగా పని చేస్తున్న యువకుడిపై అనేక ఫిర్యాదులు రావడంతో కొద్ది రోజుల క్రితం విధులకు రావద్దని స్టేషను సిబ్బంది చెప్పి పంపారు. అదే స్టేషనుకు కొత్తగా వచ్చిన ఎస్ఐకు అనుకూలంగా ఉంటుండడంతో తిరిగి డ్రైవరుగా కొనసాగిస్తున్నట్టు తెలిసింది. తమకు అనుకూలంగా ఉండే ప్రైవేటు వ్యక్తులను డ్రైవరుగా పరిచయం చేసి వాళ్ల ద్వారానే వసూళ్లు, ఇతర దందాలకు పాల్పడుతున్నట్టు సమాచారం. ఇందు కోసమే బయటి వారికి అధికారిక వాహనాలు అప్పజెప్పి తిప్పుతున్నారని పోలీసుల శాఖలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కొందరు ప్రవేటు డ్రైవర్లు ప్రభుత్వ వాహనంలో దర్జాగా తిరుగుతూ అందినకాడికి దండుకుంటున్నారన్న విమర్శలూ లేకపోలేదు. పోలీసుల శాఖలో ప్రైవేటు డ్రైవర్లను నియమించుకునేందుకు ఎటువంటి ప్రొవిజను/ అధికారిక బడ్జెట్ లేదు. అయినా వేలాది రూపాయలు వీరికి జీతాలుగా ఇస్తూ/ఇప్పిస్తూ బయటి వ్యక్తులను సొంత డ్రైవర్లుగా నియమించుకుంటున్నారు.

ఫిర్యాదులపై సమీక్షిస్తా

ప్రైవేటు డ్రైవర్లపై వస్తున్న విమర్శలు, ఫిర్యాదులపై త్వరలో సమీక్ష నిర్వహిస్తా. నిబంధనలకు వ్యతిరేకంగా నియామకాలు జరిగి ఉంటే చర్యలు తీసుకుంటాం.

–ఎం.రమేష్, డీఎస్పీ

ఘనంగా హీరో కృష్ణ జయంతి వేడుకలు



తాడేపల్లి రూరల్: నటుడు, నిర్మాత సూపర్‌స్టార్ కృష్ణ జయంతి వేడుకలను శుక్రవారం దుగ్గిరాల గ్రామంలోని జెండాచెట్టు సెంటర్ వద్ద ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని మట్లాడుతూ సూపర్‌స్టార్ ఘట్టమనేని కృష్ణ ఈ జిల్లావాసిగా సినిమా రంగంలో ప్రవేశించి అగ్ర నటుడుగా ఎదిగి ఎన్నో విప్లవాత్మకమైన పాత్రలు పోషించి, తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ఎవ్వరూ చేయలేని ప్రయోగాలు చేసి డేరింగ్ అండ్ డాషింగ్ హీరోగా పేరుగాంచారని అన్నారు. కార్యక్రమంలో షేక్ జాన్ సైదా, షేక్ సమీఉల్లా, ఖాదర్ బేగ్, మహమ్మద్ అయూబ్, మహమ్మద్ హనీఫ్ బేగ్, కాకా వెంకటేశ్వర్లు, మునిపల్లి కుమార్, బొద్దులూరి వెంకటేశ్వరరావు, రంగారావు పాల్గొన్నారు.